# సానుభూతి

ఆల్ ఇండియా రేడియో విజయవాడ,
కడప, కథాహారంలో ప్రసారితం 1980

తనదైన భార్యమీద తనకు సానుభూతి వుంటేనే ఇంకెవరి మీదయినా సానుభూతి చూపే హక్కు మగాడి కుంటుంది.

—జయప్రద

"చిన్న అందమైన మేడలో, భార్య పక్కన కూర్చుని జల్లు జల్లులుగా పడుతున్న వర్షాన్ని, ఆ వర్షపు ముసుగులో క్రొత్త అందాన్ని సంతరించుకుంటున్న ప్రకృతిని చూస్తూ తన్మయుడవుతున్న మోహనరావు, ఎదురుగా మలుపు తిరిగి ముందు కొస్తున్న దృశ్యాన్ని చూచి చలించి పోయాడు.

జీవితంలో సంధ్య తిరిగిపోయిన పండుటాకులాటి ముసల్ది ఆ ఉధృత మైన గాలిలో నిలవలేక ఊగిపోతూ వస్తోంది ఆమెను పూర్తిగా కప్పడానికి ఆమె ఒంటిమీద వున్న బట్ట చాలడంలేదు.

ఆ బట్ట దాచలేని చలిని, ఓర్చుకోవడానికి ఆమె యవ్వనం కరిగిపోయి, ఉడుకు రక్తం చల్లారిపోయి చాలా వసంతాలే గడచి పోయాయి.

తను చెప్పాల్సిందంతా చెప్పేసి, అతని జవాబు కొరకు ఎదురు చూస్తున్న కమల భర్త ఆర్ద్ర నయనాలతో చూస్తున్న దృశ్యంవంక యధాలాపంగా చూచింది.

ఈ వయస్సులో దేనికొరకో ఈ ముసలిదానికీ తాపత్రయం? పాపం! ఈ గాలిలో, ఈ వర్షంలో, పడుతూ, లేస్తూ పోవడానికిదానింట్లో ఏమవసరం కలిగిందో?" కమల మాట్లాడలేదు.

"బహుశ ఎదిగిన కొడుక్కి జబ్బుచేసి వుంటుంది. డాక్టర్ కోస వెళుతుందేమో?" కమల కళ్ళెత్తి భర్త కళ్ళల్లోకి ఒక్కక్షణం చూసి ఊర్కుంది. అతనింకా మాట్లాడుతూనే వున్నాడు. ఆ ముసల్ది ఆ మేడ దాటి వెళ్ళిపోతోంది. కమల నిదానంగా లేచి వర్షంలో తడుచుకుంటూ వెళ్ళి ఆ వృద్ధురాలి చెయ్యి పట్టుకుంది.

"వర్షం తగ్గేవరకూ మా ఇంట్లో తల దాచుకుందువుగాని-రా మామ్మా."

★ ★ ★ ★

పెరటివైపు బాల్కనీలో కూర్చుని, వసారాలో కట్టేస్తున్న ఆవు వంక చూస్తున్నాడతను.

గోమాత కళ్ళల్లోని తడికి అతని హృదయం తడిసి ముద్ద అవుతోంది.

ప్రక్కనే కొద్ది దూరంలో వున్న ఆవుదూడ పలుపు, విప్పుకుని, తల్లి దగ్గరకు పరుగెట్టాలని తాపత్రయ పడుతోంది.

"ఎంత మూగ జీవాలు ఇవి!"

అతను గబుక్కున లేచి వెళ్ళి ఆవుదూడ పలుపు విప్పేసి వచ్చి యధాస్థానంలో కూర్చుని, దూడ తల్లి పొదుగులో దూరి పాలు కుడిచే మనోహర మయిన దృశ్యాన్ని, అనంతమైన ఆత్మసంతృప్తితో, తిలకిస్తు న్నాడు.

కమల మౌనంగా అతనివంక చూస్తోంది.

ఆ మధ్యాహ్నం అతను కాఫీ అడిగినప్పుడు—

"దూడ పాలు త్రాగేసిందంది" కమల.

"ఇంకెక్కడైనా తెప్పించక పోయావా కమలా?"

"అన్ని దూడలకూ తల్లిపాలు తాగాలనే వుంటుంది మరి" అని సన్నగా నవ్వింది.

వెంటనే బిడ్డను చూచుకోవాలని కళ్ళల్లో ప్రాణం పెట్టుకుని ఎదురు చూస్తున్న ఒక ముసలి ప్రాణం గుర్తుకొచ్చి ఆ హాసరేఖ మధ్య లోనే తెగిపోయింది.

"ఒక్క రోజులో వచ్చేస్తాను. ఈ రోజు వెళ్ళనా?" తటపటా యిస్తూ—అడిగింది.

అతను జవాబు చెప్పలేదు.

ఆమె పది సంవత్సరాల నిరీక్షణలో మరో రోజు వచ్చి, నిశ్శబ్ద ముగా చోటుచేసుకుంది.

* * * *

అమ్మా! ఆకలి రెండు రోజుల నుండి మెతుకు నోటికి పోలే దమ్మా, కబళం వేయించు తల్లీ" అది దీనంగా, లోతుకుపోయిన కళ్ళతో

మాని పీలికలైన బట్టలతో, కాలే కడుపుని పట్టుకుని ప్రాధేయ పడు తున్న ముష్టిదాన్ని చూచి నిట్టూర్చాడు మోహనరావు.

"భగవంతుడా! నువ్వు వీళ్ళందరికీ తినడానికింత తిండి, కట్టడానికింత బట్టకూడా ఇవ్వలేని నిర్భాగ్యుడవైతే అసలెందుకు సృష్టించాలి వీళ్ళని!"

భార్య కళ్ళల్లోకి చూచాడతను.

ఆమె ఏ భావాన్నీ వ్యక్తం చెయ్యలేదు. నిశ్శబ్దంగా లేచివెళ్ళి, ప్లేటునిండా అన్నం, కూరా తెచ్చి, ఆ బిచ్చగత్తెకేసి, తిరిగివచ్చి భర్త ప్రక్కనే కూర్చుంటూ, మెల్లిగా అడిగింది.

"వెళ్ళ మంటారా?"

"ఎక్కడికి?"

ఆశ్చర్యంగా, బాధగా అతని కళ్ళల్లోకి చూచి, నీరసంగా లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది కమల.

* * * *

"తల్లీ, బిడ్డా కులాసాగా వున్నారా కమలా?" పక్కింటి ఓ పేద స్త్రీకి పురుడు పోసి వస్తున్న కమలను, ఆతృతగా అడిగాడు మోహనరావు.

"ఆఁ" ముభావంగా అనేసి లోపలకు పోబోయిన కమల చటుక్కున ఏదో గుర్తు కొచ్చినట్టు ఆగిపోయి, భర్త కళ్ళల్లోకి ఆశగా చూస్తూ చెప్పింది.

"బిడ్డ ప్రసవం తేలిగ్గా అయ్యాక గాని, మాణిక్యమ్మ మంచినీళ్ళు కూడా తాగలేదండీ."

"తల్లి మనసు కదా కమలా మరి."

"నాకూ అమ్మను ఒక్కసారి చూడాలని వుందండీ."

ప్రసన్నంగా వున్న అతని నుదుటి మీద బొమ్మ ముడిపడింది. వెంటనే తనను తాను తమాయించుకున్నాడు.

"చూడు కమలా! నిన్ను వెళ్ళవద్దని నేననడంలేదు. నేను చెప్పేది కూడా కాస్త విను, విని నన్నర్థం చేసుకో కమలా. నువ్వు లేందే అక్కడేం జరక్క పోదుకదా! కంటికి రెప్పలా చూచుకోవడానికి ఇద్దరు కోడళ్ళున్నారామెకు. ఇప్పుడు నువ్వు పిల్లలని, సంసారాన్ని వదిలి వెళ్తాననడమేం బాగలేదు. నీకు బాగుందనిపిస్తే, వెళ్ళు, నేనేం కాదనను."

ఆమె విచారంగా చూసింది.

మెల్లగా నోరు విప్పింది.

"ఆనాడు పదేళ్ళక్రితం మా అమ్మ మన వివాహానికి అంగీకరించక మిమ్మల్ని కించపరచి మాట్లాడింది. మీ అభిమానం గాయపడింది. నే నొప్పుకుంటాను. కానీ, ఏనాడో, కూతురి భవిష్యత్తు ఏమైపోతుందో అనే కోటి శంకలతో, కూతురి జీవితం పచ్చగా వుండాలనే ప్రలోభంతో మిమ్మల్ని తిరస్కరించిన నేరానికి, ఆమెనూ, నన్నూకూడా, ఈ పదేళ్ళుగా శిక్షిస్తూనే వున్నారు. అయినా ఆమె తరపున నేను మిమ్మల్ని క్షమాపణ వేడుకుంటున్నాను. ఈ ఒక్కసారికి మనస్ఫూర్తిగా పంపించండి."

"ఆమె తరపున నువ్వు సంజాయిషీ ఇవ్వడానికి, నువ్విప్పుడామె కూతురువి కాదు. నా భార్యవు."

నిరసనగా నవ్వింది కమల.

"ఆ మాటలు మీరంటున్నందుకు నిజానికి నాకు చాలా సంతోషంగా వుండాలి. కానీ నాకు తెలుసు మీరా మాటల్ని మీ కనుగుణంగా మాత్రమే వాడుకుంటారు. అందుకే...." ఆమె మాటల్ని ఆమె దుఃఖం మింగేసింది.

"అది కాదు కమలా ఇప్పుడేం మునిగి పోయిందనీ, ఫీ పిచ్చి గానీ."

ఆమె తిరస్కారంగా చూచింది.

"నిజమే! ముసలి తల్లి మంచానపడి తన ప్రియమైన కూతుర్ని ఒక్కసారి చూడాలని కోరుకుంటే, పది సంవత్సరాలనాడు తల్లినీ తోడ బుట్టిన వారినీ, అందరినీ వదిలేసి వచ్చిన మీ భాగస్వామి, కన్నీళ్ళు నిండిన అనుభూతితో మిమ్మల్ని పంపించమని ప్రాధేయపడితే, మీ కది పిచ్చిగానే వుంటుంది."

"పశుపక్ష్యాదుల మూగ అరుపుల్లోనూ, పరాయివాళ్ళ కన్నీళ్ళ లోనూ, మీకు కన్పించే అర్థాలు, సజీవంగా నోరు తెరిచి అడిగే మీ భాగ స్వామిలో కన్పించవు. అవును. మా ఇద్దరికీ తినడానికింత ఆస్తివుంది. మీ పెరట్లో ఆవులా కాకుండా చెప్పుకోవడానికి నోరుంది. అందుకే మామీద మీకు సానుభూతిలేదు."

ఈ రోజు కొత్తగా మాట్లాడుతున్న అర్థాంగివైపు చిత్రంగా మాస్తు న్నాడతను.

"భార్య కూడా మనిషేననీ, పోనీ పశువుకంటే హీనం కాదనీ, ఆమెకూ స్పందించే హృదయ ముంటుందనీ మీ రెప్పుడు తెలుసు కుంటారో, అప్పుడు నా వాకిట ముందుకొచ్చి, ఆకలి కడుపుతో ఇంత బిచ్చం పెట్టమని ప్రాధేయపడే ముష్టిదాని గురించీ, అంబా! అని అరిచే గోమాత గురించీ, ప్రక్కింటి మాతృప్రేమ గురించీ మీరిచ్చే ఉపన్యా సాలు నేను ఓపిగ్గా వింటాను."

నీళ్ళు నిండిన కళ్ళతో విసురుగా లేచిపోయింది కమల.

❋